


న్యూస్ బాక్స్

రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతి


శ్వేత

కాసిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలను ఎదుర్కొని నేడు ఒక్క ఉద్యోగం సాధిం చడమే గగనమైయిన ఈ రోజుల్లో మండలంలోని దేవాపూర్‌కు చెందిన పోరండ్ల శ్వేత రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. టీజీపీఎస్‌సీ ఈ యేడాది మార్చి 14న ఇరిగేషన్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫలితాలు విడుదల చేయగా ఉద్యోగం సాదించింది. అక్టోబరు 11న విడుదల చేసిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించింది.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న మంచిర్యాల జిల్లాకు చెందిన మావినేని రమేష్(45) అనే వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందాడు. కరీంనగర్ రెండో రాణా హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 8న ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడన్నారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని తెలిపారు. రమేష్ తన వివరాలు తెలపలేదని, మృతదేహాన్ని మార్చురీ గదిలో భద్రపరిచామని వివరించారు.

ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

మందమర్రిటౌన్/రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండో జోన్ పోచమ్మ బస్తీ ఏరియాకు గాలిపెల్లి ఆశీష్ అండర్- 17 జాతీయపుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల బద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 17 నుంచి జమ్ముకాశ్మీర్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నాడు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు..

దండేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ ఫెడరేషన్ అండర్- 14 జాతీయ కుస్తీ పోటీలకు దండేపల్లి మండలం కన్నెపల్లి మదర్ థెరిసా ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి పి నైతిక ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనుప్ జార్జ్, మేనేజర్ షైన్, కరెస్పాండెంట్ లింటో, పీఈటీ సుద్దాల దీపిక తెలిపారు. ఈనెల 3,4,5 తేదీల్లో నారాయణపేట జిల్లా దన్వాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో నైతిక ప్రతిభ చాటిందని తెలిపారు.

ఆర్‌పీఐ జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్, జిల్లా అధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. 28న నస్పూర్-శ్రీరాంపూర్‌లో సదస్సు ఉంటుందని, తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

దండేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ సూచించారు. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి టీకా కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వే గడువు పెంచాలి

మంచిర్యాల అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే గడువును పెంచేలా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయుఎస్) మీడియా కన్వీనర్ మోకెనపల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కులగణన సర్వేలో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, రోజుకు 6 నుంచి 8 కుటుంబాలను సర్వే చేసేందుకు అనుమతి ఇవ్వాలని తెలిపారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉపాధ్యాయులకు సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

గర్మిళ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆల యాన్ని బుధవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్‌ల కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సహాయం

నస్పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీసీసీ ఆర్‌కే-5 కాలనీలోని శ్రీ సాయి వృద్ధాశ్రమానికి ఎంపీడీసీఎల్ మంచిర్యాల జిల్లా శాఖ తరపున బుధవారం రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. చెక్కును ఎస్ఈ గంగాధర్, డీఈ కైసర్ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఏఓ రాజేశం, ఏడీఈ వేణుగోపాల్, నస్పూర్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శునకాల ఆపరేషన్లకు ఆదిలోనే ఆటంకాలు

- కాంట్రాక్టర్ నిర్వాకంతో ఖాళీగా ఆస్పత్రి
- సిబ్బంది కొరతతో నిలిచిన శస్త్ర చికిత్సలు
- ఎక్కడి నుంచి తెచ్చిన కుక్కలు అక్కడికే తరలింపు



మంచిర్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయడం ద్వారా వాటి వ్యాప్తిని నిర్మూలించేందుకు చేపట్టిన చర్యలకు ఆదిలోనే ఆటంకాలు ఎదురయ్యాయి. కాంట్రాక్టర్ నిర్వాకంతో మంచిర్యాలలోని అండాళమ్మ కాలనీ సమీపంలో రూ. 70 లక్షల వ్యయంతో నిర్మించిన పశు సంరక్షణ కేంద్రం మూన్నాళ్లకే మూగబోయింది.


శునకాలను తీసుకెళ్లడంతో ఖాళీగా కనిపిస్తున్న బోన్లు

సిబ్బంది కొరతలో శస్త్ర చికిత్సల నిలిచిపోగా, ఆపరేషన్ల కోసం వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన శునకాలను తిరిగి అక్కడికే పంపించారు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన ఆస్పత్రి భవనం వృధా అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

శిక్షణ పొందిన సిబ్బంది లేక..

ఆస్పత్రిలో శిక్షణ పొందిన సిబ్బంది లేక ప్రస్తుతం శునకాలకు శస్త్ర చికిత్సలు నిలిచి పోయాయి. పశు సంరక్షణ కేంద్రంలో ఒక వెటర్నరీ డాక్టర్‌తోపాటు ఇద్దరు వెటర్నరీ అసిస్టెంట్లు, ఒక వాచ్‌మన్, శునకాలకు ఆహారం వండి పెట్టేందుకు కుక్, హెల్పర్ విధులు నిర్వహించేవారు. బకాయి వేతనాలు చెల్లించాలని పట్టు బట్టడంతో వారిని కాంట్రాక్టింగ్ ఏజెన్సీ హైదరాబాద్‌కు చెందిన ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ ఇటీవల ఉద్యోగాల్లో నుంచి తొలగించింది. వైద్యుడు విధుల్లో ఉన్నప్పటికీ అతనికి సహాయకులు, శునకాలకు అనస్థీషియా ఇచ్చేవారు లేక ఆపరేషన్లు నిలిపివేశారు.

వివిధ ప్రాంతాల నుంచి..

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల కోసం వివిధ ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో శునకాలను ఆస్పత్రికి తీసుకొచ్చారు. వాటిని ప్రత్యేక గదిలో ఏర్పాటు చేసిన బోన్లలో ఉంచారు. శస్త్ర చికిత్సకు ముందు, తరువాత వాటిని ఆ బోన్లలో ఉంచి సంరక్షిస్తారు. పది రోజులుగా సిబ్బంది కొరతతో శస్త్ర చికిత్సలు నిలిచిపోగా శునకాలు బోన్లకే పరిమితం అయ్యాయి. పైగా వాటికి ఆహారం అందించడం, ఆలనాపాలనా చూసేవారు లేక ఆకలితో అలమటించి పోతుండడంతో ఎక్కడి నుంచి తెచ్చిన కుక్కలను తిరిగి అక్కడికే పంపించి వేశారు. దీంతో ఆస్పత్రి ఆవరణమంతా బోసిపోయింది.

మిగతా 7వ పేజీలో..

వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

- సమగ్ర సర్వేను పరిశీలించిన కలెక్టర్ కుమార్‌దీపక్


నస్పూర్‌కాలనీలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్‌లోని 11, 23 వార్డుల్లో బుధవారం ఇంటింటి సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌ల్లోని కుటుంబ సభ్యుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. నమూనాలోని ప్రతి అంశానికి సంబంధించిన వివరాలను సేకరించాలన్నారు. అనంతరం 23వ వార్డులోని కొనసాగుతున్న అమృత్-2.0 పనులను పరిశీలించారు. తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శిం చా రు. 6,10 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. హైస్కూల్ స్థాయి నుంచి గ్రూప్-2, గ్రూప్-1 ఉద్యోగాలు సాధించడానికి ప్రోత్సాహంతో పాటు కలెక్టర్ సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమాలో కౌన్సిలర్ అగల్ డ్యూటి రాజు, కమిషనర్ చిట్యాల సతీష్, తహసిల్దార్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రామన్న పాల్గొన్నారు.

కాసిపేట: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ముత్యంపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో పొందు పర్చిన కాలాలను ప్రజలకు చదివి వినిపించి వారి వద్ద నుంచి పూర్తి వివరాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడ కూడా అవకతవకలకు తావు లేకుండా సర్వే పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సప్దర్ ఆలీ, సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని నర్సింగాపూర్ పంచాయతీలోని గంపనపల్లి, మాదారం, మాదారం 3 ఇంక్లైన్, నీలాయపల్లి పంచాయతీలోని ఒడ్డెర కాలనీల్లో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను బుధవారం మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు జగదీష్, సౌందర్య, రంజిత్, తౌఫిక్, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలలో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు జడ్జి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడి కొప్పుల రాజేశ్వర్‌రావు, కారుకూరి సురేందర్, అక్కల శ్రీధర్, సత్త న్న, ప్రదీప్‌కుమార్, రాజేశ్వర్, ప్రకాశం, శివశంకర్ సంజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ నవీన్‌కుమార్

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

దండేపల్లి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ దేవదాయ ధర్మదాయ శాఖ అసి స్టెంట్ కమినర్ ఎన్ నవీన్‌కుమార్ సూచించారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో ఘాట్‌రోడ్డు, కార్తీక మాస ఉత్సావాల ఏర్పాటు తీరును ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సీఐ నరేందర్, ఎస్సై ఉదయ్ కిరణ్‌లతో కలిసి బుధవారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు.

రైలు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎంపీ

మందమర్రి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని రాఘవపురం కన్నాల మధ్యలో రైలు పట్టాలు తప్పిన ప్రదేశాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశివివేక్ బుధవారం పరిశీలించారు. అంతకు ముందు కూడా ఆయన పట్టాలు తప్పిన వెంటనే రైల్వే అధికారులకు ఫోన్ చేశారు. దాదాపు 15 బోగీలు పట్టాలు తప్పడంతో పలు రైళ్ల రాకపోకలు నిలిచి పోయాయి. ప్రమాదానికి గురైన రైలు ఘజియాబాద్ నుంచి కాజీపేటకు ఐరన్‌కాయిల్స్ తీసుకెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.


రైల్వే ట్రాకును పరిశీలిస్తున్న పెద్దపల్లి ఎంపీ వంశి

ప్రియుడి ఇంటి ఎదుట యువతి బైఠాయింపు

భీమిని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ప్రియుడి ఇంటి ఎదుట యువతి బైఠాయించిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లి మండలంలోని ఐదపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి వెంకటాపూర్ గ్రామానికి చెందిన పుట్ట శ్రీకాంత్ అనే యువకుడి ఇంటి ముందు బైఠామించింది. తనను ప్రేమ పేరుతో శ్రీకాంత్ లోబరుకున్నాడని, ఇప్పుడు వివాహం చేసుకుందామంటే దూరం పెడుతున్నాడని వాపోయింది. తాను అతడి వల్ల గర్భం దాల్చానని హాస్పటల్ కు సంబంధించిన రిపోర్టులును పట్టుకుని శ్రీకాంత్‌తో వివాహం జరిపించాలని తనకు న్యాయం చేయాలని నిరసనకు దిగింది. దీంతో శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి తన ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. కన్నెపల్లి ఎస్సై గంగారాం గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. యువతికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చి ఐదపల్లికి తీసుకొని వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

గర్మిళ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆనదం నిలయానికి ఇటకారి సత్యనారాయణ-వసంత దంపతుల కూతురు సాంస్కృతిక పుట్టిన రోజు సందర్భంగా రూ. 20 వేల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ దగా

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

దండేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రజలకు దగా చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిందని చెప్పారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలు, రైతులను మోసగించిందన్నారు. 30శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి అందరికి చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందన్నారు. రైతులకు ఎకరానికి 15వేల రైతు భరోసా, కౌలు రైతులకు 12వేల రుపాయాలు అందిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ దాన్ని అమలు చేయలేదని చెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలన్నారు. మహిళలకు 2,500, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు వెంకట రమణారావు, ప్రభాకర్, శ్రీనివాస్, కిషన్, శ్రీనివాస్, నర్సింగ్, సంతోష్, సురేందర్, మహేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో కార్తీక సందడి


సామూహిక వ్రతం ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం కార్తీక సందడి నెలకొంది. సత్యదేవుడి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకల్లో విశ్వక్సేన ఆరాధన, పుణ్యహావాచనము, అంకురారోపణము, అగ్నిప్రతిష్ఠ, నిత్యహవనములు, బలిహరణము ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు అర్చకులు గోవర్ధన సంపత్‌స్వామి, వేదపండితులు అభిరామ చార్యులు, అర్చకుల సమక్ష్యంలో నిర్వహించారు. ఉదయం నుంచే గూడెంకు తరలివచ్చి ఆలయ సమీపంలోని గోదావరి నదిలో కార్తీక పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. గోదావరి నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకొని భక్తులు సత్యదేవుడిని దర్శించుకొని సామూహిక వ్రతాలు, కార్తీకదీపారాదన ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ నవీన్, ఈవో శ్రీనివాస్ ప్రారంభించారు.

ద్వారకాపూర్‌లో ప్రత్యేక పూజలు

తాండూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో బుధవారం అభయాంజనేయ స్వామి, ధ్వజస్థంభ, నవగ్రహ విగ్రహ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మునునూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా కార్యక్రమాల క్రతువును నిర్వహించారు. రెండు రోజులుగా గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహాలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, రుత్విక్ వరణ కార్యక్రమాలు ధాన్యాధివాస, ఫల, పుష్పాధివాస జలాధివాసా కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

భీమిని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలని మండల విద్యాధికారి ఎన్ కృష్ణమూర్తి అన్నారు. రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్ట్, యూఎస్ఏఐడి సహకారంతో మోడల్ లైబ్రరీని బుధవారం ఎంఈవో పారంభించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, విజయ, మంచిర్యాల రూమ్‌టూరీడ్ డైరెక్టర్ మధు, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కన్నెపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరపు నర్సింగరావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చిలఎముల శంకర్, తాండూర్ సీఐ కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మోహిన్ (16) అనే వ్యక్తి మంగళవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడని పట్టణ ఎస్సై ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. మోహిన్ ఇంట్లోని బాత్‌రూమ్‌లో విద్యుత్ బల్బు వెలగకపోవడంతో దాన్ని సరిచేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడని తెలిపారు. వెంటనే కుటుంబసభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారని, కానీ అప్పటికే మోహిన్ మృతి చెందాడని తెలిపారు. మోహిన్ పట్టణంలోని ఓ పాఠశాలలో ఏనిమిదో తరగతి చదువుతున్నాడని తెలిపారు. తండ్రి షరీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ఒకరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ వేణుచందర్

జైపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతుల పొలాల్లోని మోటార్లు, వైర్లను దొంగతనం చేస్తున్న ఒకరిని అరెస్టు చేశామని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన వివరాలను వెల్లడించారు. సీసీ నస్పూర్‌కు చెందిన మోటం తిరుపతి, ఏవేల అంజిలు ఉల్లిగడ్డల వ్యాపారం పేరిట గ్రామాల్లో తిరుగుతారని చెప్పారు. రైతుల పొలాల వద్ద ఉన్న వైర్లను, మోటార్లను గమనించి రాత్రి దొంగతనం చేస్తున్నారన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను గుర్తించామన్నారు. బుధవారం ఇందారంలో దొంగ లించిన కాపర్‌వైర్లను తీసుకువెళ్తుండగా మోటం తిరుపతిని అరెస్టు చేశామని చెప్పా రు. అతడి వద్ద ఉన్న 20 కిలోల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నామ న్నారు. మరో నిందితుడు అంజి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ శ్రీధర్, క్రైమ్‌పార్టీ హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య, కానిస్టేబుల్ సదానందంను సీఐ అభి నందించారు. సమావేశంలో రెండో ఎస్‌ఐ నాగరాజు, ఏఎస్‌ఐ బాలయ్య పాల్గొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన ఓ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రమోద్‌రావు బుధవారం తెలిపారు. కాలనీకి చెందిన రాజేందర్ అనే వ్యక్తి అదే కాలనీకి చెందిన బాలిక(11)పై మంగళవారం సాయంత్రం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

'కలప స్మగ్లింగ్ పేరుతో చితకబాదారు'

జన్నారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలప స్మగ్లింగ్ చేస్తున్నావని, తనను అటవీశాఖ అధికారులు చితకబాదారని జన్నారం మండలంలోని పుట్టిగూడ గ్రామానికి చెందిన సత్రాజీ లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఎదుట విలేకరులతో మాట్లాడారు. గత శనివారం తమ గ్రామానికి చెందిన జాడి రాజం అనే వ్యక్తికి వంట చేసుకునేందుకు అవసరమైన కట్టెలు తీసుకొచ్చేందుకు తాను కూలీగా వెళ్లానని చెప్పాడు. ఈ విషయం తెలుసుకుని బుధవారం ఉదయం ఫారెస్టు అధికారులు తన ఇంటికి వచ్చి జీపులో జన్నారంలోని కార్యాలయానికి తీసుకువెళ్లి బేస్ క్యాంపు సిబ్బందితో కలిసి కొట్టారని తెలిపాడు. దళితుడైన తనను కలప స్మగ్లింగ్ నెపంతో జన్నారం రేంజ్ ఆఫీసర్ ఆదేశాలతో చితకబాదారని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపాడు. ఈ విసయంపై జన్నారం ఇన్‌చార్జీ రేంజ్ ఆఫీసర్ సుష్మారావును వివరణ కోరగా తాము ఎవరిని చితకబాదలేదని తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సత్రాజీ లక్ష్మణ్‌ను చితకబాది కులం పేరుతో దూషించిన అటవీ శాఖ అధికారులు, పలువురు బయటి వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు సత్రాజీ లక్ష్మణ్ ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై జన్నారం పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందింది వాస్తవమేనని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరుపుతామని తెలిపారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

జన్నారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జన్నారం ఫారెస్టు రేంజ్‌లో అక్రమంగా కలప స్మగ్లింగ్ చేస్తున్నారని మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన పొలాజీ శ్రీనివాస్, పుట్టిగూడకు చెందిన సత్రాజి లక్ష్మణ్‌లను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బుధవారం ఫారెస్టు అధికారులు బైండోవర్ చేశారు. వీరిలో పొలాజీ శ్రీనివాస్ ఇంట్లో అక్రమంగా ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నామని, సత్రాజి లక్ష్మణ్ కలప స్మగ్లింగ్ చేస్తున్నారని జన్నారం రేంజ్ ఆఫీసర్ సుష్మారావు తెలిపారు.

పులి జాడేది..?

- వారం రోజులుగా అధికారుల గాలింపు

కాసిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలో 15 రోజులుగా హడలెత్తించిన పెద్దపులి జాడ వారం రోజులుగా కనపించడం లేదు. దీంతో అటవీ శాఖ అధికారులు పులి కోసం గాలిస్తున్నారు. దీనికి అడుగు జాడలు ఎక్కడా కనబడకపోవడంతో అధికారుల్లో ఉత్కంఠ నెలకొంది. పత్తి తీసే కూలీలు, పశువుల కాపర్లకు సైతం పులి కనిపించక పోవడంతో అందరిలో ఆందోళన మొదలైంది. 15 రోజుల క్రితం గోండూగూడెంకు చెందిన రైతు చిత్రు ఆవుల మందపై దాడి చేసి రెండు ఆవులను చంపివేసింది. అనంతరం కవ్వాల అభయారణ్యానికి పులి ప్రయాణమైంది. మూడు రోజుల వ్యవధిలో పెద్ద ధర్మారం సమీపంలో పులి అడుగుల కనిపించాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. గత వారం రోజుల క్రితం ముత్యంపల్లి అటవీ సెక్షన్ నుంచి దేవాపూర్ అటవీ సెక్షన్‌లోకి వచ్చినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. అడవిలో శాఖాహారం జంతువులను వేటాడుతూ సేద తీరుతూ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడు మృతి

మందమర్రి టౌన్, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలచెట్టు ఏరియాకు చెందిన పెరిక నర్సయ్య (66) సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకుడు అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలను పెద్దపల్లి జిల్లాలోని కొత్తపల్లిలో నిర్వహించడంతో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు.

'ఎమ్మెల్యే ఎవరిని బెదిరించలేదు'

మంచిర్యాల అర్బన్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఎవరిని బెదిరించలేదని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. బుధవారం పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ మాట్లాడారు. మార్కెట్‌లో నిర్మాణం తొలగింపులో ఎమ్మెల్యే కక్షసాధింపుకు పాల్పడుతున్నారని కొంతమంది కోర్టుకు వెళ్లారని చెప్పారు. దీంతో కక్ష కట్టి వారి ఇళ్లు, షాపుల ముందు కందకాలు తవ్వారంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఎమ్మెల్యే పట్టణ అభివృద్ధికి శ్రమిస్తుంటే బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించడం లసరికాదని హితవు పలికారు. సమావేశంలో నస్పూర్ చైర్మన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసుల సమస్యలు పరిష్కరిస్తాం

మంచిర్యాల అర్బన్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పోలీసుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏజెల్ల శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ క్లబ్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎం.రాజమల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాజమౌళి గౌడ్, ఉపాధ్యక్షుడు టివేణుగోపాల స్వామి, సహాయ కార్యదర్శి తాహేరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దేశ్వర సంస్థాన్‌లో ధ్యాన మందిరంలో ధ్యానం చేస్తున్న భక్తులు(ఫైల్)



భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పూలాజీబాబా (ఫైల్)

ఆధ్యాత్మిక క్షేత్రంగా పాట్నాపూర్

- భక్తి, సేవ మార్గాలతో విరాజిల్లుతున్న పూలాజీబాబా ఆశ్రమం
- సకల జనులకు ఆరాధ్యగురువు పూలాజీబాబా
- ప్రత్యేక రోజుల్లో సందడిగా పట్నాపూర్

జైనూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోగల పట్నాపూర్‌లోని పూలాజీబాబా ఆశ్రమం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. సకల జనులను ఆధ్యాత్మికమార్గంలో పయనింపజేసిన పరమ హంస సద్గురు పూలాజీబాబాకు సర్వమత ధర్మాలు సమానం. ప్రతి మానవుడిలోనూ ఈశ్వరుడు ఉన్నాడని హితబోధనలు చేసిన సిద్ధ మహాయోగి పూలాజీబాబా. ఆయన తనదైన శైలిలో ధ్యానం ద్వార భక్తులను జాగృతం చేసిన సిద్ధ మహాయోగి.

పూలాజీబాబా మహారాష్ట్రలోని ఔండాజిల్లా పరిధిలో గల సావలి గ్రామంలో 1925,ఆగస్టు30న జన్మించారు. ఆ సమయంలో కుటుంబ ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేనందున ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి జైనూరు మండలంలోని పట్నాపూర్‌లో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. తదనంతరం కష్టపడి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ పాలన గావిస్తున్న క్రమంలో ఆయనకు జ్ఞానోదయం కల్గడం ప్రారంభమైంది. బాబా తన 40సంవత్సరాల వయస్సులో భార్య పిల్లల్ని వదిలి ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూరు పరిధిలోగల మలంగి దట్టమైన అటవీ ప్రాంతలో ఒక నద్ది ఒడ్డున వెలిసిన వెదురు(బొంగు) గుహలో స్థిరపడ్డారు.

12సంవత్సరాలు అడవిలోనే ఒంటరిగా ధ్యానం:

పూలాజీబాబా ఎలాంటి ఆహారం తీసుకోకుండా ధ్యానం చేశారు. ఆయనచుట్టు వన్యమృగాలు, జింకలు కోతులు వచ్చినా బాబావారు వాటివైపు కన్నెతి చూడ లేదు. అలా 12సంవత్సరాలపాటు ఓంటరిగా అడవిలో ఉంటూ ధ్యానమార్గాన్ని అలవర్చుకున్నారని పట్నాపూర్ వాసులు అంటున్నారు. అప్పుడప్పుడు పట్నాపూర్‌కు రాకపోకలు చేస్తూ పలుకరిస్తుండేవారని పేర్కొంటున్నారు. బాబావారి ప్రవచనం, హితబోధనలతో ప్రేరితమైన చుట్టు పక్కల ప్రజలు దాదాపు 110ధ్యాన కేంద్రాలను ఏర్పరచు కున్నారు. అందులో సత్యనిష్ఠతో ధ్యానం చేస్తూ ఆధ్యా త్మికత వైపు దృష్టి సారిస్తున్నారు.

ధ్యానంపై బోధనలు:

ధ్యానం జీవన భాగం కావాలని పూలాజీబాబా బోధించారు. ధ్యానం ద్వారా మనస్సును శుద్ధి చేసుకోవడం, పరమాత్మను దర్శించు కోవడం సాధ్యమవుతుందని ఆయన భక్తులకు వివరించారు. అదేవిధంగా ఒకవ్యక్తి చిత్తశుద్ధితో ధ్యానం చేసినప్పుడు తనకు తానుగా ఆత్మజ్ఞానాన్ని పొందుతాడని బోధిస్తూ భక్తులకు దిశా, నిర్దేశం చేశారు.

పూలాజీబాబా సేవలు :

భక్తులలో వ్యక్తిత్వవికాసం, నైతికతను పెంచి, సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడంలో బాబా ముఖ్యపాత్ర పోషించారు. పేదలకు కోసం ఆయన ఆహారం అందించడం, వైద్యసహాయం చేశారు. గురుపౌర్ణమి, ఆశ్రమ వార్షికోత్సవం, మహాశివరాత్రి తదితర వేడుకలకు వేలాదిగా భక్తులు వస్తుంటారు.

అక్రమ కబ్జాలపై అధికారుల ఉక్కుపాదం

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్టు ప్రాంతంలో కొద్దికాలంగా ఉన్న బీడీపీపీ భూములు, నాళాలను ఆక్రమించుకుని అక్రమకట్టడాలు కడు తున్న నేపథ్యంలో మీడియాలో వచ్చిన కథనాలతో స్పందించిన రెవెన్యూ అధికారులు బుధవారం వాటిని కూలగొట్టారు. అదే ప్రాంతం నుంచి వెళ్తున్న నాళాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో లోకేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జాచేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్ణీతవిధానాన్ని అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకేంద్రంలో ప్రభుత్వభూముల, బీడీపీపీ భూములు ఆక్రమణపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వం కూడ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ దామోదర్, తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పశు గణన ప్రారంభం

బెజ్జూరు, నవంబరు 13: మండలకేంద్రంలో బుధవారం పశుగణన ప్రారంభమైంది. వెటర్నరీ అసిస్టెంట్ జితేందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గోల్కొండ కాలనీలో పశు గణన నిర్వహించారు.

సొంత ఖర్చులతో మట్టి రోడ్డుకు మరమ్మతులు

చింతలమానేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండ లంలోని కర్జవెల్లి గ్రామానికి చెందిన చౌదరి ఓంకార్ అనే యువకుడు కర్జవెల్లి-ముంజంపల్లి మార్గంలో మట్టిరోడ్డును తనసొంత ఖర్చులతో మరమ్మతు చేయించాడు. దీంతో వాహనదారులకు ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగుతు న్నాయి. దీంతో ఓంకార్‌ను పలువురు ప్రశంసించారు.

మండల రాయిసెంటర్ ఏర్పాటు

పెంచికలపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లూరు గ్రామంలో బుధవారం మండల పంచాయతీ రాయ్‌సెంటర్, రాజ్‌గోండ్ సేవాసమితి ఎన్నిక నిర్వహించారు. సర్‌మేడిగా పోర్తెట్టి ప్రభాకర్, ఉపమేడిగా అశోక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాజ్‌గోండ్ సేవాసమితి నాయకులు సుధాకర్, మోతిరాం, శ్రీనివాస్, గుణవంతరావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

దహెగాం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూప్రకారం భోజనం వడ్డించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి మెనూప్రకారం భోజనం అందించకపోవడంపై మండిపడ్డారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరురిజిస్టర్లను పరిశీలించి 80మంది విద్యార్థినులగైర్హాజరుపై మండిపడ్డారు. ఈమేరకు నివేదికలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యాలయం ఆవరణలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీకార్యదర్శిని ఆదేశించారు. పాఠశాలలో ఆర్వోఆర్ ప్లాంటును పరిశీలించగా అదిచెడి పోయిందని ఉపాధ్యాయులు తెలపడంతో తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. పాఠశాల ఆవరణలో బోరుబావినీటి షాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కుపంపించి పరీక్షలు నిర్వహించి నివేదికలను కలెక్టర్‌కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. అనంతరం బీబ్రా గ్రామంలో సమగ్రకుటుంబ సర్వేను పరిశీలించారు. సర్వేలో భాగంగా కుటుంబ వివరాలను తప్పులు లేకుండా పూర్తి చేయాలన్నారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు.

ధాన్యం రైతులకు మద్దతు ధర..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర చెల్లిస్తామని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామన్నారు. క్వింటాలుకు గ్రేడ్-ఎ రకం రూ.2320, గ్రేడ్-బి రకానికి రూ.2300 చెల్లిస్తామన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వంరూ.500బోనస్ ఇస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగు నీరు, నీడ, గోనెసంచులు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. తేమ శాతం 17ఉంటే కొనుగోలు చేపట్టాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేందర్, సీఈవో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌పాయిజన్ కారకులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వాంకిడి ఆశ్రమబాలికల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌కు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతనెల 29న ఆహారం వికటించి 60 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన జరిగి 15 రోజులు గడిచినా ఫుడ్ పాయిజన్ కారణం తెలియకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమ న్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయాసంఘాల నాయకులు సాయికుమార్, టికానంద్, సాయికృష్ణ, అయూబ్‌ఖాన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● ఏఎస్పీ ప్రభాకర్‌రావు



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రభాకర్‌రావు

ఆసిఫాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోఈనెల17,18తేదీల్లో నిర్వహించే గ్రూపు-3పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఏఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని గ్రూపు-3 పరీక్షల చీఫ్‌సూపరింటెండెంట్, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు బయోమెట్రిక్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష నిర్వ హణలో బయోమెట్రిక్ విధానం చాలా కీలకమైందన్నారు.ఈ సందర్భంగా పోలీసు బయోమెట్రిక్ ఆఫీసర్ మార్కొండేయ, అసిస్టెంట్‌పోలీస్ బయోమెట్రిక్ ఆఫీసర్‌శ్రీను, సందీప్ బయోమెట్రిక్ తీసుకునే సమయంలో ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమనిబంధనలు శిక్షణలో వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ లక్ష్మీనర్సింహా, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌డివిజన్‌లోని చీఫ్ సూపరింటెండెంట్‌లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

సిర్పూర్(యు), నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనోరలో బుధవారం దక్కన్ గ్రామీణబ్యాంక్ అధికారులు లబ్దిదారులు, రైతులకు బుధవారం బ్యాంక్ ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌ఫీల్డ్ అధికారి కిశోర్‌మాట్లాడుతూ రైతులు సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా అనుమానాలు వస్తే బ్యాంక్ అధికారులను సంప్రదించాలని ఫీల్డ్ అధికారికిశోర్ తెలిపారు. బ్యాంక్‌సిబ్బంది బాబులాల్, మాజీ సర్పంచ్ మేస్రాం భూపతి, లబ్దిదారులు పాల్గొన్నారు.

నియామకం

జైనూర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): జైనూర్ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా సిర్పూర్ (యు) మండలంలోని పాములవాడకు చెందిన కుడ్మెత విశ్వనాథ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై నమ్మకంతో చైర్మన్ పదవిని కట్టబెట్టిందని, రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం: గురువారం చైర్మన్‌గా కుడ్మెతవిశ్వనాథ్ ప్రమాణస్వీకారం ఉంటుందని సంబంధితఅధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ కోరారు.

వాహనాలు తనిఖీ

జైనూర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం జైనూరు సీఐరమేష్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవర్లు లైసెన్సులు కలిగి ఉండాలని, వాహనాలు అతివేగంగా, అజాగ్రత్తగా నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

నష్టపరిహారం అందజేత

కెరమెరి, నవంబరు 13: అక్టోబరులో నాగల్‌గొంది గ్రామానికి చెందిన ఎల్లయ్యకు చెందిన ఆవుపై పులిదాడిచేసి చంపివేసింది. బుధవారం బాధితుడికి మంజూరైన నష్టపరిహారం రూ.10వేలచెక్కును కెరమెరి అటవీ అధికారి మజారోద్దీన్ అందజేశారు.

కళాశాలను సందర్శించిన డీఐఈవో

కౌటాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవోకల్యాణి సందర్శించారు. కళాశాల రికార్డులు పరిశీలించారు. అలాగే ఒకేషనల్‌విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని వృత్తినైపుణ్యాలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు, అధ్యాపకులు అశోక్, శ్రీనివాస్‌నాయక్, రాజంప్రకాష్‌రంజిత్, మోతిలాల్‌నాయక్, అంజనేయులు, పాల్గొన్నారు.



రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలి

శ్రీరాంపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధిం చాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య అన్నారు. ఆర్కే7 గ్రూపుఏజెంటుగా బాధ్యతలుచేపట్టిన రాజేందర్‌ను యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఆయనకు పూలమొక్క బహూకరించారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఆయాగనుల జీవితకాలం పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో ఉపప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సహాయకార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, ఏరియా కార్యదర్శి మారేపల్లిసారయ్య, సదానందం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందేందుకు మంచి అవకాశం

శ్రీరాంపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డిసిగ్నేషన్‌తో మహిళా ఉద్యోగులు పదోన్నతి పొందేందుకు మంచి అవకాశమని ఇన్‌చార్జి ఎస్‌వోటు జీఎం శ్రీధర్‌రావు అన్నారు. 16డిసిగ్నేషన్లలో భర్తీచేసేందుకు ఏరియాస్టోర్స్, ఏరియా వర్క్‌షాప్, సీహెచ్‌పీ, జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా బదిలీవర్కర్లు/జనరల్‌మజ్దూర్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వారు ఎంచుకున్న ఉద్యోగానికి అనుగుణంగా తగిన శిక్షణ ఇస్తామని, ఈ అవకాశాన్ని మహిళాఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కౌన్సెలింగుకు 85మంది హాజరయ్యారు. కార్యక్రమంలో డీజీఎంలు మల్లయ్య, రవీందర్, చంద్రలింగం, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, ఎస్ఈ(ఐఈడీ) కిరణ్ కుమార్, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ సమస్యల పరిష్కారానికి లైజన్‌సెల్



లైజన్‌సెల్‌ను ప్రారంభిస్తున్న వెంకటయ్య

మందమర్రి టౌన్, నవ ంబర్ 13(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారం కోసం లైజన్ సెల్ ఆఫీస్‌ను ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య, డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఇది సింగరేణి వ్యాప్తంగా ఉద్యోగులకు ఉన్న ప్రధానసమస్యల తక్షణ పరిష్కారానికి దోహదపడనుంది. 11ఏరియాలు ఉండగా మెజారిటీగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు 15 వేలకుపైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల చిరకాల కోరిక అయిన సెల్‌ను ప్రారంభించామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే రాతపూర్వకంగా రాసి ఇస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గనుల వేలంలపై రౌండ్ టేబుల్ సమావేశం

మందమర్రి టౌన్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఆర్ క్లబ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బొగ్గుగనుల వేలంను ఉపసంహరించుకోవాలని కోరుతూ గురు వారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించ నున్నట్లు జిల్లా నాయకుడు శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి అందరు ఆహ్వానితులేనని పేర్కొన్నారు. సమావేశంలో అందరి అభిప్రాయాలను తెలుసుకుంటామని తెలిపారు. దీనిని విజవంతం చేయడానికి అన్నివర్గాల వారు హాజరు కావాలని తెలిపారు.

లైవ్ సర్టిఫికెట్లు సమర్పించండి

శ్రీరాంపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్‌ఉద్యోగులు లైవ్ సర్టిఫికెట్లు సమర్పించాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఒకప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగిపెన్షన్, సీపీఆర్ఎంఎస్ మెడికల్ హెల్త్‌కార్డు రెన్యూవల్ చేసుకునేందుకు ప్రతిఏడాది నవంబర్‌లో సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఐఎన్‌టీయూసీలో చేరికలు

శ్రీరాంపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్, తదితరులు యూనియన్‌లో చేరిన వారిలో ఉన్నారు.

న్యూస్ బాక్స్

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగుల సంక్షేమాన్ని నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలు, వివిధ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా మహిళ శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి స్వరూపరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 14 సాయంత్రం 5 గంటలలోగా జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పశుగణన ప్రారంభం

కాసిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఐదేండ్లకు ఒకసారి చేపట్టే పశుగణన బుధవారం మండలంలో ప్రారంభమైంది. మండలంలో ఏడుగురు ఎన్యూమరేటర్లను నియమించినట్లు మండల పశువైద్యాధికారి సరిత తెలిపారు. ఫిబ్రవరి వరకు పశుగణన సర్వే చేపడుతామని, రైతులు సహకరించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బెల్లంపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33 వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రూ. 3 లక్షలతో పనులను చేపడుతున్నట్లు తెలిపారు. పనులు నాణ్యతగా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమా శ్రీనివాస్, కమీషనర్ శ్రీనివాస్, డీఈ సాయికిరణ్, టీపీ అశ్విత్, కాంగ్రెస్ నాయకులు బండి రాము, ఎజాస్, బానేష్ తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన

బెల్లంపల్లిరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున అన్నపూర్ణ సహిత సోమేశ్వర దేవాలయం నుంచి భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు గ్రామంలోని అన్ని వీధుల గుండా నగర సంకీర్తన చేపడుతామని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత

తాండూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని ఎస్ఐ కిరణ్‌కుమార్ అన్నారు. కాసిపేట గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో గ్రామస్థులతో మాట్లాడారు.

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం..

ఆహ్లాదంతో పాటు ఆధ్యాత్మికతకు చిరునామాగా మారాయి సల్పలవాగు పరిసరాలు. దట్టమైన అడవుల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన సల్పల బండల పై నుంచి జాలువారే జలపాతాలు చూపరులను కట్టి పడేస్తున్నాయి. వీటికి తోడు ఆధ్యాత్మికతను పంచే ఆలయాలు ఉండడం సల్పల వాగు అందాలకు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు తరలివస్తున్నారు.


బండలపై నుంచి జాలువారుతున్న నీరు


- కనువిందు చేస్తున్న సల్పలవాగు అందాలు
- ఆలయాలతో భక్తుల పరవశం
- యేటా వైభవంగా సీతారాముల కల్యాణం
- పర్యాటకంగా అభివృద్ధి చేస్తే మరింత ప్రయోజనం

కాసిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీకి రెండు కిలోమీటర్ల ముందు వచ్చే సల్పల వాగు అందాలు ఆకట్టుకుంటున్నాయి. పడమటి గుట్టల పై నుంచి వచ్చే వర్షం నీరు సల్పల వాగు వద్దకు వచ్చే సరికి అష్ట వంకర్లు తిరుగుతూ హోయలు పలికించే వరద నీరు తన అందాలను పంచుతుంది. వేసవిలో సైతం ఊట నీరు నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. వాగును ఆనుకుని సీతారామాంజనేయ స్వామి ఆలయంతో పాటు వెంకటాద్రి ఆలయం, అలాగే రామాంజనేయ ఆలయం ముందు సిర్పూర్ (యు)కు చెందిన జగన్నాథ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇవి ఆధ్యాత్మికతను పంచుతున్నాయి. దీంతో సల్పలవాగు ప్రాంతం ఎప్పుడు జన సందోహంతో నిండి ఉంటుంది. ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి అదనపు ఆదాయం రావడంతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే అవకాశాలున్నాయి.

● ఆలయాల్లో పూజలు..

సల్పల వాగును ఆనుకుని సీతారామాంజనేయ ఆలయంతో పాటు వెంకటాద్రి ఆలయం ఉంది. ప్రతి రోజు భక్తులు ఆలయాల్లో భక్తులు పూజలు చేస్తుంటారు. వెంకటాద్రి ఆలయంలో ఆదివాసీ ఉత్సవాలను యేటా నిర్వహించుకుంటున్నారు. మానసిక ప్రశాంతత కోసం అనేక మంది యువకులు, పెద్దలు ఇక్కడ సేద తీరు తుంటారు. దేవాపూర్ మాజీ సర్పంచు కొడిపె ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో యేటా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరపడం ఆనవాయితీగా వస్తోంది. వేసవి కాలంలో అంజన్న భక్తులు రామాలయానికి వచ్చి పూజలు చేస్తుంటారు. హనుమాన్ మాలాధారణ, విర మణలతో ఆలయం ప్రాంగణంలో సందడి నెలకొంటుంది.


సల్పల వాగు ప్రాంతంలో ఉన్న సీతారామాంజనేయ ఆలయాలు


సల్పల వాగు ప్రాంతంలో జగన్నాథ్ మహారాజ్ విగ్రహం

● సమీప జిల్లాలనుంచి..

సల్పలవాగు అందాలను చూసేందుకు మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ప్రకృతిని ఇష్టపడే వారు వివాహ, పుట్టిన రోజు వేడుకలను సల్పలవాగు ప్రాంతంలో జరుపుకుంటారు. శీతాకాలంలో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోని తాండూర్, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, పెద్దప ల్లి జిల్లా నుంచి గోదావరిఖని నుంచి పాఠశాల విద్యార్థులను పిక్నిక్‌కు సల్పలవాగు ప్రాంతానికి తీసుకువస్తుంటారు. ప్రకృతి ఒడిలో పారే జలపాతాలను పచ్చని ప్రకృతిని ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతుంటారు. నీటిలో కేరింతలు కొడుతూ సంతోషంగా గడుపుతారు.

● అటవీశాఖ సైతం ఆసక్తిగా ఉంది..



పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అటవీ శాఖ కూడా ఆసక్తిగా ఉంది. పర్యావరణ పరిరక్షణతో పాటు వన్య ప్రాణుల పరిరక్షణకు అందరు కృషి చేయాలి.అటవీ శాఖ నిబంధనలకు లోబడి పనులు చేసుకోవాలి. అటవీ భూభాగంలో అనుమతులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టకూడదు.

- ప్రవీణ్‌నాయక్, ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి

రైతులు మద్దతు ధర పొందాలి


సీతారాంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో పంటను విక్రయించి మద్దతు ధరను పొందాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. నస్పూర్ పట్టణం సీతారాంపల్లిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా వ్యవసా య శాఖ అధికారి కల్పనలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ చెల్లిస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సన్నరకం, దొడ్డురకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తూకం, తేమ యంత్రాలు, తాగునీరు, నీడ, గన్నీ సంచులు, టార్పాలిన్లు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుర్మిల్ల వేణు, తహసీల్దార్ శ్రీని వాస్, కమిషనర్ చిట్యాల సతీష్ కొనుగో లు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని కిష్టంపేట లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని మ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రమీల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వనజ, కాంగ్రెస్ మండల అధ్య క్షుడు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, సత్తరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని లక్ష్మీకాంతపూర్, ద్వారక, ధర్మరావుపేట,ముదాపూర్, లింగాపూర్, మాకులపేట, ఆల్లీపూర్, నర్సాపూర్, వందుర్‌గూడ, కన్నెపలితో పాటు పలు గ్రామాల్లో 32 ధాన్యం కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, వైస్ చైర్మన్ ఎండీ ఆరిఫ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ డైరెక్టర్ రాకేష్, విజయ్, జంగు, ఐకేపీ ఏపీఎం భూపతి బ్రహ్మయ్య, సీసీలు తిరుపతి, సురేందర్, అశోక్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: చంద్రవెల్లిలో డీఆర్‌డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం చైర్మన్ చింతం స్వామి, ఎంపీడీవో మహేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో ప్రేమ్‌కుమార్, ఏపీఎం శ్యామల, ఏఈవో అంజలి, సీసీలు రామకృష్ణ, సుందరేష్ తదితరులు పాల్గొన్నారు.


కిష్టంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్

మన కూరగాయలకు 'మహా' డిమాండ్

● రోజు రాబడితో కుశ్నపల్లి రైతులకు ప్రయోజనం

బెజ్జూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రతిరోజూ ఆదాయాన్నిచ్చే పంటలు కూరగాయాలు. ప్రణాళికాబద్ధంగా దఫదఫాలుగా వివిధరకాల కూరగాయాలు విత్తుకుంటూ ఉంటే ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ రాబడి ఉంటుంది. తమకు ఉన్న భూమిలో వివిధ రకాల కూరగాయలు పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన రైతులు.

● ఏడాది పొడవునా..

మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన రైతులు వారికున్న వ్యవసాయభూమిలో ఏడాది పొడవునా కూరగాయలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఈగ్రామంలో 100శాతం రైతు కుటుంబాలే నివసిస్తున్నాయి. వారికున్న వ్యవసాయ భూమిలో కొంతమేర ప్రత్యేకంగా కూరగాయల సాగు కేటాయించారు. వాణిజ్య పంటలైన పత్తి, కంది తదితర పంటలు ప్రకృతి వైపరిత్యాల కారణంగా ప్రతి ఏటా నష్టాలను చవి చూస్తుండటంతో రైతులు మిర్చీ మొదలుకొని టమాట, వంకాయ, బీరకాయ, కొత్తిమీర, పాల కూరతో పాటు వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఈ ప్రాం తంలోనే కాకుండా పక్కనే ఉన్న మహారాష్ట్రకు కూడా ఇక్కడి కూరగాయలు వెళ్తాయంటే వాటికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇక్కడ పండించిన కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడడంతో ఇతర ప్రాంతాల వ్యాపారులు కొనుగోలు చేయడానికి ఇక్కడికి వస్తుంటారు. కొందరు రైతులు ద్విచక్ర వాహనాలు, ఆటోల ద్వారా పక్కనే ఉన్న మహారాష్ట్రకు తరలించి వారసంతల్లో విక్రయించి లాభాలు గడిస్తున్నారు. కూరగాయలకు అక్కడ మంచి డిమాండ్‌ఉండడంతో అక్కడ ప్రతిశనివారం జరిగే వారసంతలో విక్రయిస్తున్నారు. వారసంతలోనే కాకుం డా ఇతర రోజుల్లోసైతం ఇక్కడి రైతులు ద్విచక్రవాహనాలపై కూరగాయలను పెట్టుకొని అక్కడి గ్రామాల్లో తిరిగి అమ్ము తుంటారు. బెజ్జూరు నుంచి అహెరి కేవలం 25కిలో మీటర్ల దూరం మాత్రమే ఉండడంతో ఉదయం వాహ నాల్లో కూర గాయలు సిద్ధం చేసుకొని కూరగాయలు విక్రయించి సాయంత్రానికి ఇంటికి చేరుకుంటారు. కుశ్నపల్లి గ్రామరైతులకు ప్రతి ఇంటికి ద్విచక్రవాహనం ఉంది. మరికొందరికి ఆటోలు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోయింది. ప్రస్తుతం గూడెంవద్ద ప్రాణహిత నది వద్ద వంతెన నిర్మాణంపూర్తి కావడంతో రవాణా సదుపాయం ఏర్పడింది. దీంతో ఇరుప్రాంతాల వారికి రాకపోకలుసులువుగా మారాయి. ప్రస్తుతం వివాహాల సీజన్ కావడంతో కుశ్నపల్లి కూరగాయలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఎక్కడ వివాహం జరిగినా విందు భోజనం కోసం ఇక్కడి నుంచే కూరగాయలు తీసుకు వెళ్తుంటారు.


కుశ్నపల్లిలో రైతులు పండిస్తున్న వంకాయ


ద్విచక్రవాహనంపై తరలిస్తున్న కూరగాయలు


మహారాష్ట్రలోని అహెరి వారసంతలో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

కూరగాయల సాగుతో కుటుంబ పోషణ..



తమ గ్రామం పూర్తిగా కూరగాయల సాగుచేసి జీవనాన్ని గడుపుతున్నాం. ఏడాది పొడవునా పండించిన కూరగాయలు విక్రయించి లాభాలు గడిస్తున్నాం. దీంతో ఖర్చులకు ఎలాంటి ఇబ్బందులు లేదు. ఉన్న దాంట్లో వివిధ రకాల కూరగాయలు పండించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాం.

- గుర్లె ప్రభాకర్, రైతు కుశ్నపల్లి

మహారాష్ట్రలో విక్రయిస్తాం..



తమ గ్రామంలో పండించిన కూరగాయలకు మహారాష్ట్రలో మంచి డిమాండ్ ఉంది. దీంతో అక్కడికి వెళ్లివిక్రయిస్తాం. ఇక్కడి కూరగాయలంటే అక్కడివారు ఇష్టంగా తింటారు. ప్రతిరోజు తాజా కూరగా యలను ద్విచక్రవాహనాల ద్వారా తీసుకవెళ్లి అహెరి మార్కెట్‌లో విక్రయిస్తాం.

- చిలకయ్య, రైతు కుశ్నపల్లి

శునకాల ఆపరేషన్లకు ఆదిలోనే ఆటంకాలు

5వ పేజీ తరువాయి

సిబ్బంది తొలగింపుతో..

ఆస్పత్రి సిబ్బందిని కాంట్రాక్టరు ఉద్యోగాల్లో నుంచి తొలగించడం, ఆహారం అందక శునకాలు మరణించిన నేపథ్యంలో పశు సంరక్షణ కేంద్రంలో ప్రస్తుతానికి శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. మరోవైపు సిబ్బందిని తొలగించడం ద్వారా దాదాపు పది కుక్కల మరణానికి కారణమైన కాంట్రాక్టర్‌ను అధికారులు బ్లాక్ లిస్టులో పెట్టినట్లు తెలిసింది. దీంతో ఆస్పత్రి తాత్కాలికంగా మూతపడింది. డాగ్ క్యాచర్లు ఉన్నప్పటికీ శునకాలను వెనక్కి పంపించినందున వారికి పని లేకుండా పోయింది. దీంతో డాగ్ క్యాచర్లను సైతం తిరిగి పంపించనున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టినందున ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు ఇప్పట్లో ప్రారంభమయ్యే అవకాశాలు లేవు. ఆస్పత్రి నిర్వహణకు మరోసారి టెండర్లు ఆహ్వానించి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాల్సి ఉంటుంది. ఆ తతంగం ముగిసే వరకు సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. కాగా సెంటర్‌ను ప్రారంభించిన ఏడు నెలలకే వివాదాలు చుట్టుముట్టి, ఆస్పత్రి మూతపడినందున వెంటనే టెండర్లు ఆహ్వానిస్తారా అన్న సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయి, మూడేళ్ల వరకు ఖాళీగా ఉంది. ఎట్టకేలకు మార్చిలో భవనాన్ని ప్రారంభించినప్పటికీ అతి తక్కువ సమయం లోనే తిరిగి మూతపడింది. ఈ క్రమంలో టెండర్లు ఆహ్వానించడం ద్వారా ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పునరుద్ధ రిస్తా రా, వదిలేస్తారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ టెండర్లు ఆహ్వానించకపోతే భవన నిర్మాణానికి వెచ్చించిన రూ. 70 లక్షల నిధులు వృథా అయ్యే పరిస్థితులు ఉన్నాయి.

విద్యార్థులు సత్తా చాటాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాల అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా డిసెంబరు 4 నుంచి నిర్వహించనున్న జాతీయ సాధన సర్వే (2024)లో జిల్లా విద్యార్థులు సత్తా చాటాలని జిల్లా విద్యాధికారి (డీఈవో) ఎస్ యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని సైన్స్ సెంటర్‌లో జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లకు బుధవారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు మాదిరి ప్రశ్నపత్రాలను విద్యార్థులందరితో సాధన చేయించాలని చెప్పారు. సులువుగా జవాబులు గుర్తించే మెలుకువలను విద్యార్థులకు నేర్పించాలని, డిసెంబర్ 4న హాజరయ్యేలా చూడాలని, సర్వేలో మంచిర్యాలను ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. వీటితో పాటు యు డైస్ ప్లస్, ఇన్‌స్పైర్, నామినల్ రూల్స్ నింపే విధానం, తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చౌదరి శ్రీనివాస్, సత్యనారాయణ మూర్తి, పరీక్షల విభాగం కమిషనర్ దామోదర్ రావు, డీసీబీ సెక్రటరీ భీమ్‌రావు, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, మంచిర్యాల ఎంఈవో మాలవీదేవి, మాస్టర్ ట్రైనర్ దత్త కుమార్, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరి కుమారస్వామి, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు.. ప్రయాణికుల ఇబ్బందులు


నిర్మానుష్యంగా మారిన బెల్లంపల్లి రైల్వేస్టేషన్

బెల్లంపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో జిల్లా కేంద్రం మీదుగా వెళ్లే పలు రైళ్లు బుధవారం రద్దయ్యాయి. బెల్లంపల్లి మీదుగా కాగజ్‌నగర్ వెళ్లే భాగ్యనగర్, సింగరేణి, రామగిరి ప్యాసింజ్, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్ సిటీ సిర్పూర్ టౌన్, కరీంనగర్ రైళ్లను రద్దు చేశారు. అలాగే న్యూఢిల్లీ నుంచి సికింద్రాబాద్ , చెన్నై వెళ్లే పలు రైళ్లు సైతం ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో తమ గమ్యస్థానాలకు వెళ్లారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం


బృందానికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వివేక్, నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అక్టోబరు 25వ తేదీన భద్రాచలంలో చేపట్టిన పాదయాత్ర బుధవారం శ్రీరాంపూర్‌కు చేరుకుంది. పాదయాత్ర బృందానికి ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామితో పాటు మాల మహానాడు జిల్లా నాయకులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికుడి విగ్రహానికి, నస్పూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, ఉపాధ్యక్షుడు పాలితం శంకర్, తొగరి సుధాకర్, జై భీమ్ సైనిక్ దళ్ కన్వీనర్ ఆసాది పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సొల్లు శ్రీను, ఉపాధ్యక్షుడు జింజుపల్లి నర్సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి తలారి రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు గరిసె రామస్వామి, ప్రధాన కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్, నస్పూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఐత పరమేశ్వర్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు పుట్ట రవి పాల్గొన్నారు.

జైపూర్: మంత్రి పదవీ కంటే మాలల అభివృద్ధే ముఖ్యమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. ఎస్సీల ఐక్యత కోసం మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన పాదయాత్ర బుధవారం ఇందారం గ్రామానికి చేరుకుంది. పిల్లి సుధాకర్‌కు చెన్నూరు నియోజకవర్గ మాలమహానాడు శీలం వెంకటేష్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ పాదయాత్రలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో గజెల్లి లచ్చన్న, సొల్లు శ్రీనివాస్, రామస్వామి, రామన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

జైపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీ సీఈవో గణపతి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, జైపూర్ ప్రభుత్వ పాఠశాల, గురుకుల పాఠశాలలను బుధవారం సందర్శించారు. వంట గదులను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కేజీబీవీ పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థినులకు ఏ విధమైన ఆహార పదార్థాలను అందిస్తున్నారని ఎస్‌వో ఫణిబాలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ పాఠశాలలో ఏమైనా సమస్యలున్నాయా అని ఎస్‌వోను అడిగారు. ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకుని భోజనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పాఠశాల నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శి ఉదయ్, ఉపాధ్యాయులు ఉన్నారు.



వంతెనల నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

ఆసిఫాబాద్ మండలంలో అసంపూర్తిగా ఉన్న గుండి వంతెన

- జిల్లాలో దశాబ్దంన్నరగా పెండింగ్‌లోనే ప్రధాన వంతెనలు
- అధికారులు, నాయకుల చిన్నచూపు
- వంతెనలు లేక అవస్థలు

ఆసిఫాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అడవుల జిల్లా కుమరం భీం ఆసిఫాబాద్‌లో వాగులు, ఒర్రెలు అనేకం ఉన్నాయి. దాదాపు గ్రామా లన్నీ వీటిని అనుకునే ఉన్నాయి. చిన్న పాటి వానలకే వాగులు, ఒర్రెలు పొంగుతాయి. వానాకాలంలో కురిసే భారీవర్షాలకు వచ్చే వరదలతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. అంతంత మాత్రంగానే రహదారి సౌకర్యం ఉన్న ఆయా గ్రామాల ప్రజలు వంతెనలు లేక తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా వంతెన నిర్మాణపనులు సాగుతూ.. ముందుకు కదలటంలేదు. అధికారుల, నాయకుల చిన్నచూపుతో నిధులు మంజూరుకాక వంతెనలు పూర్తికాకపోవడంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్రఅవస్థలు పడుతున్నారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన మంత్రి సీతక్క ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు కాలినడకన వాగు దాటిల్సి వచ్చింది. వాంకిడి మండలంలోని వెల్గి గ్రామానికి ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఎడ్లబండిపై వాగుదాటి వెళ్లాల్సి వచ్చింది. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న వంతెనల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● ప్రతీయేటా వర్షాకాలం అవస్థలు..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీలో ప్రతిఏటా వర్షాకాలం వచ్చిందంటే ప్రజలకు ప్రత్యక్ష నరకమే. గూడాల నుంచి ప్రధానపట్టణాలకు రావాలంటే భగీరథ ప్రయత్నం చేయాల్సిందే. జిల్లాలోని 335పైగా ఆవాసాలకు నేటికీ అసలు రహదారి సౌకర్యమే లేదంటే ఉన్న గ్రామాలకు వాగులు, వంకల రూపంలో వర్షాకాలమంతా అష్టదిగ్బంధనమే. ఇటు ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అయిదు ఏజెన్సీ మండలాలతోపాటు కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూరు, చింతలమానేపల్లి, దహెగాం, పెంచికలపేట, కాగజ్‌నగర్ వరకు అన్ని మండలాల్లో ప్రజలు ఒకే రకమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో చిన్న చిన్న వాగులు మొదలుకుని ఎర్రవాగు, పెద్దవాగు, ప్రాణహిత పరివాహక ప్రాంతంలోని వంకలపై నేటికి వంతెనలు లేకపోవడంతో ప్రజానీకం బయట ప్రపంచానికి చేరుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. జిల్లాలో ఇలా చిన్నా చితక కల్వర్టు మొదలుకుని భారీవంతెనల వరకు ఏవీ పూర్తికాకపోవడంతో ఏటా ప్రజానీకానికి ఇక్కట్లు తప్పడం లేదు. పనులను వేగవంతం చేయాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరించడంతో ప్రతివర్షాకాలంలో ఈ సమస్యలు తప్పడం లేదని వివిధ మండలాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొని ఉంది. ప్రధాన వంతెనల నిర్మాణ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ఆయాగ్రామాల ప్రజలు తిప్పలు పడాల్సివస్తున్నది.

● ఏళ్లుగా సా...గుతున్న వంతెనల నిర్మాణాలు..

గ్రామాలకు రవాణా కష్టం తీర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి పూర్తి స్థాయిలో చేరడం లేదు. మారుమూల గ్రామాల ప్రజలు ఇప్పటికీ కష్టాలు పడుతున్నారు. కాలంతో కుస్తీ పడుతూ సమస్యల సుడి గుండంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో నిర్మిస్తున్న వంతెన నిర్మాణపనులు దశాబ్దాలుగా కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలోని పెద్దవాగుపై గుండివంతెన నిర్మాణ పనులు దశాబ్దన్నర కాలంపాటు కొనసాగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారు. గుండి గ్రామానికి వర్షాకాలంలో వెళ్లడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కెరమెరి మండలంలోని ఉమ్రి వంతెన అసంపూర్తిగా ఉండడం వల్ల మహారాష్ట్రలోని 12గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని అనార్ పల్లి-కరంజివాడ, లక్మాపూర్ వంతెనల నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కాగజ్‌నగర్-వాంకిడి మండలాల మధ్య కనర్‌గాం వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు 15సంవత్సరాలు గడుస్తున్నా నేటికి అసంపూర్తిగానే ఉంది. దీంతో ఆయాగ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.



ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగు దాటుతున్న మంత్రి సీతక్క (ఫైల్)

సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని జన్కాపూర్‌వార్డు మేకలవాడలో కొనసాగుతున్నసర్వేను మున్సిపల్‌కమిషనర్ భుజంగరావుతోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేసిబ్బంది ప్రతిఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలను సేకరించాలన్నారు. నిర్ణీతనమునాలో పొందుపరిచిన ప్రతిఅంశాన్ని తప్పనిసరిగా పూరించాలని తెలిపారు. సర్వే చేపట్టే ముందురోజు ఇళ్లయజమానులకు ముందస్తు సమాచారం అందించి అవసరమైన పత్రాలతో సిద్ధంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివరాల సేకరణలో సర్వేసిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయకూడదన్నారు. వివరాలను స్పష్టంగా నమోదుచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి..

జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలోగల వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని జన్కాపూర్ వార్డు మేకలవాడలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వార్డులలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మురుగు కాలువల్లో పూడికతీత ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. వార్డులలో అంతర్గత రహదారులపై చెత్తచెదారం లేకుండాశుభ్రంగా ఉంచాలనితెలిపారు. ఈక్రమంలో వాడలోని కిరాణదుకాణం ముందు ఉన్న చెత్తచెదారాన్ని పరిశీలించి సంబంధిత దుకాణం యజమానికి జరిమానా విధించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆయనవెంట మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, తదితరులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌కుమార్

వాంకిడి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాలల హక్కులు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్‌వర్కర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఖిర్డి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్తంగా నిర్వహించిన అవగాహనకార్యక్రమంలో ఆయనపాల్గొని మాట్లాడారు. విద్యార్థిదశనుంచే బాలల హక్కులు, రక్షణచట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పితాంబర్, సుకన్య, శకుంతల, సిబ్బంది పాల్గొన్నారు.

కాళోజి వర్ధంతి



నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కాగజ్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాళోజి వర్ధంతిని కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయదేవ్ మాట్లాడుతూ కవితలతో కాళోజీ ప్రజాచైతన్యాన్ని తీసుకొచ్చారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన కవితలు కీలకంగా ఉన్నట్టు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు నర్సయ్య, వైఎస్ఆర్ మూర్తి, చిన్నయ్య, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వయోధికుల ఆధ్వర్యంలో: కాగజ్‌నగర్‌లోని వయోధికుల ఆధ్వర్యంలో బుధవారం కాళోజి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ కాళోజి రచించిన రచనలు, కవితలు ఉద్యమాన్ని ఉత్తేజపరిచినట్టు వివరించారు. కార్యక్రమంలో నాయకులు యునారాయణ, కలికోట రమణయ్య, రాంబాబు, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండాలి: ఎమ్మెల్యే హరీష్ బాబు



ఎమ్మెల్యే హరీష్ బాబును సన్మానిస్తున్న వ్యవసాయాధికారులు

కాగజ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారులు రైతులకు అండగా ఉండాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ డివిజన్‌కు చెందిన వ్యవసాయాధికారులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు రైతాంగానికి చేదోడు, వాదోడుగా ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏడీఏ మనోహర్, ఏవో రామకృష్ణ, గిరిషన్, కార్తిష, ప్రేమలత, మనీషా, నాగరాజు పాల్గొన్నారు.

పెరుగుతున్న చలి తీవ్రత

పెంచికలపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చలితీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. పదిరోజుల నుంచి వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. వేకువ జామున పొగమంచు కప్పేస్తోంది. దాని ప్రభావం ఉదయం 9గంటలవరకు ఉంటోంది. మధ్యాహ్నం సాధారణ స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉండగా, సాయంత్రం, రాత్రి సమయంలో కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో గ్రామాల్లో చలికి నెగళ్లు ఏర్పాటుచేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌మండలంలోని కేజీబీవీ, అర్బన్‌రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగాఉన్న బోధనేతర సిబ్బంది స్వీపర్-1, డే వాచ్‌మెన్-1, నైట్‌వాచ్‌మెన్-1, అసిస్టెంట్‌కుక్-1 పోస్టులకు అర్హులైన వారు ఈనెల14నుంచి20లోగా ఎంఈవోకార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ



ఏఎస్సై కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు పోలీసుశాఖ ఎప్పుడు అండగా ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్‌రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధు లు నిర్వహిస్తూ గుండె పోటుతో మృతిచెందిన గులాం మక్సూద్‌షైమద్ కుటుంబానికి తనకార్యాలయంలో రూ.2,13,185చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విధులు నిర్వ ర్తించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాలపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. మరణించిన పోలీసుల కుటుంబాలకు పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తరఫునమరణించిన పోలీసుల కుటుంబాలకు అందించాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరగా అందేలాచర్యలు చేపట్టాలని జిల్లా పోలీసు కార్యా లయ అధికారులకు సూచించారు. అదేవిధంగా కుటుం బంలో అర్హతగల వ్యక్తికి ప్రభుత్వఉద్యోగం వచ్చేలా కృషిచేస్తామని ఎస్పీ షైమద్ కుటుంబసభ్యులకు భరోసాను ఇచ్చారు. అదేవిధంగా పోలీసు కోఆపరేటీవ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతిఒక్కరుతెలుసుకొని ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అంజన్న, జిల్లాకోఆపరేటీవ్ సొసైటీఇన్‌చార్జి జాఫర్, ఏఎస్సై కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


రైళ్ల రద్దుతో ఇబ్బందులు పడిన ప్రయాణికులు



హెల్ప్ డెస్క్‌లో వివరాలు తెలుసుకుంటున్న ప్రయాణికుడు

కాగజ్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రామగుండం సమీపంలో గూడ్స్ పట్టాలు తప్పటంతో ఈ మార్గం గుండా వెళ్లే రైళ్లన్నింటిని రైల్వేశాఖ రద్దు చేసింది. కాగజ్‌నగర్ మీదుగా వరంగల్, హైదరాబాద్ వెళ్లేందుకు మార్గాలున్నాయి. గూడ్స్ పట్టాలు తప్పటంతో రైల్వే అధికారులు ఆయా రైళ్లను రద్దుచేసినట్టు తెలిపారు. రద్దు చేసిన వాటిలో రామగిరి, పుష్పుల్, ఇంటర్‌సిటీ, సింగరేణి, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ ఉండగా, మిగితా సమాచారం కోసం కాగజ్‌నగర్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. రైళ్ల రద్దుతో వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకువెళ్లాల్సిన ప్రయాణికులు బస్సులను ఆశ్రయించారు. అలాగే మహారాష్ట్ర వైపు వెళ్లే ప్రయాణికులు ఆసిఫాబాద్ మీదుగా బల్లార్ష మీదుగా వెళ్లారు.

శిక్షణతోనే ఉజ్వల భవిష్యత్



శిక్షణ పొందిన కార్మికులు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నేషనల్ కన్స్ట్రక్షన్ అకాడమీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు అందించిన ఉచిత నైపుణ్య శిక్షణతో ఉజ్వల భవిష్యతు ఉంటుందని భవన నిర్మాణకార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, మండలాధ్యక్షుడు కమలాకర్, అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో ఎన్ఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నైపుణ్యశిక్షణ ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్మి కులకు శిక్షణ భవిష్యత్‌లో ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఎన్ఏసీ శిక్షకుడు శంకర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు 15రోజుల పాటు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి త్వరలోనే ధ్రువీకరణపత్రాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచందర్, ఆనంద్‌రావు, మనోహర్, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-3 పరీక్షకు పూర్తి ఏర్పాట్లు చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల17,18తేదీల్లో జరుగనున్న గ్రూపు-3పరీక్షకు పూర్తిఏర్పాట్లు చేయాలని రాష్ట్రపబ్లిక్‌సర్వీస్ కమిషన్‌చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, ఎస్పీలు, ప్రాంతీయ సమన్వయకర్తలతో పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేష్‌దోత్రే మాట్లాడుతూ గ్రూపు-3 పరీక్షకు జిల్లాలో పూర్తిఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. 18పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లాలో 4471మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని అన్నారు. ఈ క్రమంలో పరీక్షాకేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, విద్యుత్, వైద్యసిబ్బంది తదితర అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేస్తామని అన్నారు. సమీప జిరాక్స్ సెంటర్లు మూసివేస్తామన్నారు. స్ట్రాంగ్‌రూంనుంచి పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్నాపత్రాల తరలింపు, పరీక్షా కేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ తప్ప వేరే ఎవరికి మొబైల్ అనుమతి లేదని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనర్సింహ, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో పూర్తివసతులు కల్పించాలి..

ఆసిఫాబాద్‌రూరల్: గ్రూపు-3 పరీక్షకు జిల్లాలో ఏర్పాటుచేసిన పరీక్షకేంద్రాల్లో పూర్తి వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలికల, బాలుర పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న పరీక్షకేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూపు-3పరీక్షకు పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షకు అవసరమైన ఫర్నీచర్, వెలుతురు, ఫ్యాన్లు ఏర్పాటుచేయాలని, ప్రహరీకి ఆనుకుని ఉన్నగదుల కిటికీలను మూసిఉంచాలని, విద్యుత్‌లో ఎలాంటిఅంతరాయం లేకుండా సరఫరాజరిగేలా ప్రత్యేకదృష్టి సారించాలని తెలిపారు. అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయన వెంట పరీక్షల ప్రాంతీయసమన్వయకర్త లక్ష్మీనర్సింహ, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల సమగ్ర అభివృద్ధికి 'పీఎం జుగా' పథకం

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 13(ఆంధ్ర జ్యోతి): గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధా నమంత్రి జనజాతీయ గ్రామీణఉత్కర్ష్ అభియాన్(జుగా) పథకంద్వారా గిరిజనులకు సంక్షేమ, అభివృద్ధిపథకాలు అందించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు పథకం ప్రత్యేకాధికారిశంకర్, గిరిజనసంక్షేమశాఖ ఉపసంచాలకురాలు ఆర్ రమాదేవి తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలో జరిగిన సన్నాహకసమావేశంలో మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో ఈనెల 15నదర్తి అబాభగవాన్, బిర్సాముండా జయంతిని పురస్కరించుకొని గిరిజన గౌరవదినోత్సవసమారోహం, పథకం ప్రారంభోత్సవకార్యక్రమం రూపురేఖలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఏటీడీవోలు ఖమర్‌హుస్సేన్, శ్రీనివాస్, ఎస్ఈఆర్పీ రవీందర్, అనంతి, నిరంజన్, నజిముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శంకర్

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



పూజలు చేస్తున్న కుడ్మెత విశ్వనాథ్, అధికారులు

జైనూర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్టార్ జిన్నింగ్‌మిల్లులో బుధవారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, డీఎం అశ్వక్ అహ్మద్, మిల్లు యజమాని రితేష్ రాథోడ్, సహకార చైర్మెన్ కొడప హన్నుపటేల్ తదితరులు పూజలు చేసి రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేశారు. పత్తి క్వింటాలుకు ప్రభుత్వపరంగా 7521రూపాయలు ధర ఉందని రైతులు ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీవో నరేష్ కోరారు. ఈ సందర్భంగా కుడ్మెత విశ్వనాథ్ మాట్లాడుతూ రైతులు ప్రైవేటులో పత్తిని అమ్మకుండా నేరుగా సీసీఐలో విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటి, ఇర్ఫాన్ అహ్మద్, సీఈవో సోనకాంబ్లే జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు అధోగతి

● పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్

కాగజ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌తో జీవితాలు అధోగతి పాలవుతాయని పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్ బారిన పడరాదన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి యువకులు పెడదారి పట్టరాదని సూచించారు. చక్కగా చదువుపై దృష్టి సారించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై దీకొండ రమేష్, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్

పత్తిని దళారులకు అమ్ముకోవద్దు: ఎమ్మెల్యే హరీష్‌బాబు



పత్తి తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే

సిర్పూర్(టి), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని దళారులకు అమ్మకుండా సీసీఐ ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని శ్రీరామ కాటన్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటుచేసిన పత్తికొనుగోలు కేంద్రాన్ని ఆయనప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈసారి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 7521ధర నిర్ణయించిందని రైతులుసీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తినిఅమ్ముకోవాలన్నారు. దళారులకు అమ్ముకున్నట్లయితే రైతులు అన్నివిధాల నష్టపోతారన్నారు.

కాగజ్‌నగర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ దేవయ్య మాట్లాడుతూ రైతుల సౌకర్యం కోసం ప్రభుత్వం పత్తికొనుగోలుకేంద్రం ప్రారంభిం చిందన్నారు. ఏడీఏమనోహర్ మాట్లాడుతూ రైతులు పత్తిని విక్రయించేటప్పుడు తప్పకుండా పట్టాపాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్‌ను నమోదుచేయాలన్నారు. ఏమైనా సందేహాలుంటే ఏఈవోలనుఅడిగి తెలుసుకోవాలన్నారు. తేమ 12 శాతం ఉండకుండా చూసుకునేబాధ్యత రైతులదేనన్నారు. ఈవిషయాన్ని రైతులు గమనించి తేమశాతం అధికంగా లేకుండా చూడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను జిన్నింగ్ మిల్లుయజమాని సిద్ధయ్య సన్మానించారు.

కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్, సత్యనారాయణ,అశోక్, సాయి, ప్రశాంత్, విలాస్, నాని, మార్కెట్‌కమిటీకార్యదర్శి భాస్కర్, వ్యవసాయాధికారి గిరీష్,సీసీఎల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.